నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.అమర్‌సింగ్ తెలిపారు. హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, రాధా రిపేట్స్ ఫేస్-2, పావనీ హార్మనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పార్ట్ ఆఫ్ పద్మశ్రీహిల్స్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. సన్‌సిటీ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హిమగిరి కాలనీ, గంధంగూడ, హైదర్షాకోట్ గ్రామం, సన్‌సిటీ మెయిన్ రోడ్డు, జెయిన్స్ సాల్స్‌బర్గ్, వెస్టెండ్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నార్సింగి ఏఈ పరిధిలో...

మణికొండ: కొత్త సర్వీసులు విడుదల చేయటం, మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శనివారం పలు ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతారాయం కలుగుతుందని నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు 7 హిల్స్ వెనుక, శ్రీకృష్ణ గోశాల, నెక్నాంపూర్ గ్రామం, 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మంచిరేవుల, మంత్రి విల్లాస్, గ్రీన్‌ల్యాండ్ కాలనీ, జైహింద్ కాలనీ, 11.30 నుంచి 12 గంటల వరకు బృందావన్ కాలనీ, నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్, క్యూబా కాలనీ, క్వాస్వా కాలనీ, వివేకానంద నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు గోల్డన్ మైల్, బాబుఖాన్ విల్లాస్, గ్రాండ్ ఇన్‌ఫ్రా టెక్ విల్లాస్, దంతు స్ట్రీట్, ఖానాపూర్ గ్రామం, ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. బుద్వేల్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 1 గంటల వరకు, నాయుడు కాలనీ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. ఉప్పర్‌పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒటి గంట నుంచి 1.30 గంటల వరకు, జనచైతన్య ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు, బాసిత్ బాబా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు. పరమా రెడ్డి హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అధికారులు వివరించారు.

ధర్నాకు తరలిన బీజేపీ శ్రేణులు




రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్నాకు బయలుదేరిన బీజేపీ నాయకులు

గచ్చిబౌలి: మూసీ బాధితులకు అండగా ధర్నా చౌక్‌కు శేరిలింగంపల్లి బీజేపీ శ్రేణులు తరలివెళ్లాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన మహాధర్నాకు శేరిలింగంపల్లి ఇంచార్జీ ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మసీద్‌బండ పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజలను భయపెట్టడం సరైన చర్యకాదన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ శేరిలింగంపల్లి కన్వీనర్ రాఘవేంద్రరావు,నాయకులు ఎల్లేష్, రమేష్, వసంత్‌యాదవ్, రాధాకృష్ణ యాదవ్, ఆంజనేయులు సాగర్,శ్రీనివాస్, నర్సింహాచారి, రమణయ్య పాల్గొన్నారు.

'అది మాకు వారసత్వంగా వచ్చిన భూమి'

శంషాబాద్: పట్టణంలోని శంషాబాద్ రెవెన్యూ పరిధిలోని 626బై1లో 12.4 ఎకరాల భూమి తమకు వారసత్వంగా సక్రమించిందేనని దీనిపై హైకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న నగరానికి చెందిన వ్యక్తి వలీయుద్దీన్‌ఖాన్, ఆయన తరపు న్యాయవాది మీర్‌అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. దీనిపై కొందరు ఉద్దేశపూర్వకంగా అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. దీనిపై శుక్రవారం ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ అధీనంలో ఉన్న భూమిలో హెచ్‌ఎండీఏ, రెవెన్యూ జోక్యం తగదంటు హైకోర్టు గత నెల ఆదేశాలు కూడా ఇచ్చినట్లు ధ్రువపత్రాలను చూపించారు. కోర్టులో పోరాడుతున్న భూమిపై న్యాయస్థానం ఇచ్చే తుది తీర్పు మేరకు తాము నడుచుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కాలనీలో భూమి తమ ఆధీనంలోకి తీసుకునేందుకు నలుగురు వ్యక్తులు తమను ఇబ్బంది పెట్టడంతో పాటు అధికారులను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వివాదాస్పదంగా ఉన్న సంబంధిత భూముల్లో తాము ఎలాంటి చర్యలకు పాల్పడటం లేదన్నారు.

చెత్తను తడి, పొడిగా వేరుచేయాలి



చెత్తను వేరు చేసి సేకరిస్తున్న దృశ్యం

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను వేరు వేరుగా చేసి అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 4, 5, 6వ డివిజన్‌లలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తడి, పొడి చెత్తను వేరు వేరుగా చేసి ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. ప్రజలకు చెత్తను వేసేందుకు మూడు రకాల డబ్బాలు ఇప్పటికే అందించామన్నారు. ఆకుపచ్చ రంగు డబ్బాలో తడి చెత్త, నీలం రంగు డబ్బాలో పొడి చెత్త, ఎరుపు రంగు డబ్బాలో హానికారక చెత్తను వేసి కార్మికులకు అందజేయాలన్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కోరారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వేయరాదని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, కృష్ణ, లక్ష్మి, నారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చోరీలు చేస్తున్న బాలలు

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొంత కాలంగా నల్లా పైప్‌లు, అద్దాలు ధ్వసం చేయడంతో పాటు పుస్తకాలు చోరీ చేస్తున్న పోకిరీలైన నలుగురు బాలలను స్థానికులు పట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి విచారించిన పోలీసులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. నలుగురు కూడా పాఠశాల స్థాయి విద్యార్థులు కావడం గమనార్హం. కొంత కాలంగా కళాశాలలో గుర్తు తెలియని ఆకతాయిలు చేస్తున్న విధ్వంసంతో కళాశాల ప్రిన్సిపాల్ పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఓపెన్ హౌస్‌లో భాగంగా జాగిలాలను ప్రదర్శిస్తున్న పోలీసులు





ఓపెన్ హౌస్‌లో పోలీసు ఆయుధ సంపత్తిని తిలకిస్తున్న విద్యార్థులు, వాటి గురించి వివరిస్తున్న పోలీసులు

శాంతిభద్రతల సంరక్షణలో... పోలీసుల పాత్ర కీలకం

సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీవింగ్ డీసీపీ సృజన

- సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆకట్టుకున్న 'ఓపెన్ హౌస్'
- పాల్గొన్న 1200 మంది విద్యార్థులు





రాయదుర్గం: పోలీసులు సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తారని సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన పేర్కొన్నారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ... భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే విజయం సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలీస్‌స్టేషన్ గురించి, అది పనిచేసే విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ఏడాదికో సారి ఓపెన్‌హౌస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆయుధాలు, పోలీసుల పనితీరు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పోలీసు ఆయుధ సంపత్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలల నుంచి 12 మంది విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు ఆసక్తిగా ఆయుధాలు, పోలీసు జాగిలాలు, గుర్రాలను ఆసక్తిగా తిలకించారు. ఆయుధాల పనితీరు గురించి తెలుసుకున్నారు. మెషిన్ గన్స్, అధునాతన రైఫిల్స్, బాంబును గుర్తించే పరికరాలను ఉపయోగించడంపై ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యంగా బాంబు డిస్పోజల్ బృందం పరికరాలను ప్రదర్శించగా, స్నిఫర్ డాగ్‌లు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించాయి. వాసన ద్వారా పేలుడు పదార్థాలను గుర్తించడం చూపారు. మౌంటెడ్ పోలీసులు గుర్రపు స్వారీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, ఏసీపీలు ప్రసన్నకుమార్, నాగసాయి, అరుణ్‌కుమార్, ఇంద్రవదన్, ఇన్‌స్పెక్టర్ సునీత, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, భరోసా ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం, ఆర్‌ఐ హనిమిరెడ్డి, వీరారెడ్డి, బాంబ్ డిస్పోజల్ టీమ్ ఆర్‌ఐ గణేష్, కృష్ణ, ఎంటీఓ వీరలింగం, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సైబరాబాద్ కమిషనరేట్‌లో ఓపెన్ హౌస్‌లో పాల్గొన్న బృందం



సైబరాబాద్ కమిషనరేట్‌లో ఓపెన్ హౌస్‌ను తిలకించేందుకు వచ్చిన విద్యార్థుల బృందం

ఆర్టీసీ బస్సుల్లో మెరుగైన ప్రయాణాన్ని అందించాలి



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డిపోను శుక్రవారం డిప్యూటీ ఆర్‌ఎం (ఎం) జగన్ సందర్శించారు.ఈ సందర్శనలో భాగంగా డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం బెస్ట్ మెకానిక్‌గా ఎన్నికైన శివ కుమార్, బెస్ట్ శ్రామిక్‌గా ఎన్నికైన ఎస్.కె.రెడ్డిలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్‌ఎం జగన్ మాట్లాడుతూ ప్రయాణికులకు నాణ్యమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలంటే బస్సుల నిర్వహణ మెకానిక్‌లపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ విధులను సక్రమంగా నిర్వహించి పరిశుభ్రమైన, మంచి కండిషన్ ఉన్న బస్సులను అందించి సంస్థపై ప్రయాణికులకున్న గౌరవాన్ని మరింత పెంపొందించాలన్నారు. రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనారాయణ, మెకానికల్ ఇంజినీర్ నీలిమ, ఎస్‌టీఐ, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

మజ్లిస్, కాంగ్రెస్ పోరుతో కుంటుపడుతున్న అభివృద్ధి!

గోల్కొండ: నాంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్‌ఖాన్ అనుచరుల మధ్య వీధి పోరాటాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గత కొన్ని రోజుల క్రితం హుమాయున్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంపై ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, ఫిరోజ్‌ఖాన్ మధ్య మాటామాటా పెరిగి వీధిపోరాటానికి దారి తీసింది. ఆ రోజు నుంచి అహ్మద్‌నగర్, మెహిదీపట్నం, విజయ్‌నగర్ కాలనీ, మురాద్‌నగర్, ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆధిపత్య పోరాటం కోసం మజ్లిస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. కాగా శుక్రవారం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్‌ఖాన్ పంచాయితీ నగర పోలీస్ కార్యాలయంలో జరగడం విశేషం.

అభివృద్ధి పనుల్లో నాణ్యతపై రాజీపడం



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని.. నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి విలేజ్‌లో హులియాదాసరి సంఘం సభ్యుల అభ్యర్థన మేరకు ఆ కాలనీలో పర్యటించారు. నూతన కమ్యూనిటీ హాల్ కోసం కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించారు. నూతనంగా నిర్మించిన రోడ్లను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్ ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధిని దశలవారీగా చేయిస్తున్నానని తెలిపారు. అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయన్నారు. కమ్యూనిటీ హాల్ కోసం అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, కిరణ్, తలారి చిన్నా, శ్రీకాంత్‌రెడ్డి, గణేష్ ముదిరాజ్, కిషన్ శంకర్, నిహాల్ యాదవ్, పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీరాం హరణ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ లక్ష్మీరాం హరణ్ ప్లాట్ యజమానుల సొసైటీ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ నిబంధనల ప్రకారం ఏర్పాటైన ఈ కార్యవర్గానికి జిల్లా కో ఆపరేటివ్ అధికారి సుధాకర్ ఆమోదముద్ర వేశారు. ఎల్‌ఆర్‌హెచ్ ప్లాట్ ఓనర్స్ మెయింటెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా శీలం సాయి సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా నెట్టెం కన్నబాబు, సెక్రటరీగా శివకుమార్ తిరుమల్లి, జాయింట్ సెక్రటరీగా వారణాసి సుబ్రహ్మణ్య కశ్యప్, కోశాధికారిగా గోబింద పంకజ్ అగర్వాల్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా హరికిషన్ అగర్వాల్, పుంజాల దేవరాజు, తోట శ్రీనివాస్, మేడం వరలక్ష్మీ ఎన్నికయ్యారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా జిల్లా కోర్టు సీనియర్ అధికారి వెంకట రంగారెడ్డి వ్యవహరించారు. ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించిన అపార్ట్‌మెంట్ వాసులందరికి ప్రెసిడెంట్ సాయి రెడ్డి, డైరెక్టర్ హరికిషన్ అగర్వాల్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం: సీపీఐ



మాట్లాడుతున్న పుస్తకాల నర్సింగ్‌రావు

రాజేంద్రనగర్: గిరిజన సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మెంబర్ పుస్తకాల నర్సింగ్ రావు అన్నారు. శుక్రవారం తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా సమావేశం రాజేంద్రనగర్‌లోని దేవరాజ్ భవన్‌లో గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి భిక్షు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగ్‌రావు మాట్లాడుతూ... గిరిజన తండా గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించాలని, రాష్ట్రంలో ఎస్టీ కమిషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి గిరిజన సంస్కృతిని పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని... ఎస్టీ కార్పొరేషన్ సబ్సిడీ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. గిరిజనుల 10 శాతం రిజర్వేషన్ సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. తండాల్లో మంచి నీరు, విద్యుత్, రోడ్ల సౌకర్యం, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి జర్పుల శివ నాయక్, సీపీఐ మండల కార్యదర్శి రియాజ్, గిరిజన సమాఖ్య జిల్లా కోశాధికారి రమావత్ చత్రు నాయక్, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు లోక్యా నాయక్, శంకర్ నాయక్, సరిలాల్ నాయక్, ఆఫీస్ కార్యదర్శి సత్యం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థన స్థలాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

గోల్కొండ: ప్రార్థన స్థలాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి పోలీసులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ హాజీరి అన్నారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గత వారమే తాను డివిజన్ పరిధిలోని గోల్కొండ, లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్లకు చెందిన ప్రార్థన స్థలాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకతపై వివరించామన్నారు. బోనాలు, వినాయక చవితి, శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, చంటిబాబు, ఆజామ్ ఖాన్, ఇమ్రాన్ అలీఖాన్, శోభాపాండే తదితరులున్నారు.

నగరానికి చేరుకున్న మంత్రుల బృందానికి స్వాగతం

శంషాబాద్: మూసీ సుందరీకరణలో భాగంగా సియోల్ పర్యటన చేసిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల బృందం శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వారికి ఘనంగా స్వాగతం పలికాయి. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య తదితరులకు పుష్పగుచ్ఛాలు అందజేసి కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్, శ్రీధర్‌యాదవ్, నజీరుద్దీన్, మిట్టు, శ్రీధర్ పాల్సన్ తదతరులు ఉన్నారు.



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ తదితరులు

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



మణికొండ: మణికొండ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఇబ్రహీం బాగ్ డీఈ రమేష్‌చంద్రకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతుతూ... విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ ఉన్నాయన్నారు. త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా కావడం లేదని పలు ప్రాంతాల్లో కనీస రక్షణ చర్యలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయన్నారు. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. శుక్రవారం ఆయనను కలిసి పంచవటి కాలనీ, హుడా కాలనీ, ఖీజ్రా కాలనీ, కేపీఆర్ కాలనీ, బాబుహిల్స్, వెంకటేశ్వర కాలనీలలో నెలకొన్న సమస్యలను ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, రాజేంద్రప్రసాద్, లక్ష్మయ్య, నరేందర్, విఠల్, శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



ప్రభాకర్ (ఫైల్)

మణికొండ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ 7వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కోకాపేటలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. నార్సింగి పోలీసుల సమాచారం మేరకు... పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన గనివాడ నాగ ప్రభాకర్(27) గచ్చిబౌలిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ అక్కడే ఉన్న ఇన్‌టచ్ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు, అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి అధికం అయింది. వాటిని తాళలేక కోకాపేటలోని విరూపాక్ష మెన్స్ హాస్టల్‌కు వచ్చి 7వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోకాపేటకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడటం వెనక కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అతని సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంచి ఆహార అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మణికొండ: మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి, చిత్తూరు ఎంపీ డి.ప్రసాద్‌రావు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీప్రియ కాలనీలో డాక్టర్ ప్రభు లైఫ్ మల్టీస్పెషాలిటీ క్లినిక్స్‌లో శుక్రవారం షుగర్, లివర్ స్కాన్, చర్మ వ్యాధులకు ఉచితంగా అధునాతన పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఇటీవల వందలో 70 మందికి వయసుతో సంబంధం లేకుండా షుగర్ వ్యాధులు రావటంతో లివర్, కిడ్నీలు పాడై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వ్యాధులను ముందుగానే గుర్తించి డాక్టర్‌ల సలహాల మేరకు తగు మందులు వాడితే కొంత ఉపశమనంతో జీవించే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను తరచూ నిర్వహించి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న డాక్టర్ ప్రభుకుమార్ అభినందనీయుడన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాలి, డాక్టర్‌లు ఇమ్రాన్‌అలీ, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగిస్తూ అనర్థాలను.. వాటిని వాడొద్దంటూ అవగాహన కల్పిస్తూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కాంగ్రెస్ పాలనలో పేదలకు తప్పని కష్టాలు



బీజేపీ మహాధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకురాలు ఉమామహేశ్వరిరెడ్డి తదితరులు

అత్తాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నారని బీజేపీ నాయకురాలు ఉమామహేశ్వరిరెడ్డి ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో మూసీ బాధితులకు అండగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మహాధర్నాకు అత్తాపూర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల హామీని అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. దశాబ్దాలుగా ఇళ్లు కట్టుకున్న పేద,బడుగు ప్రజల ఇళ్లు కూల్చడానికి ముఖ్యమంత్రికి అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుల మెప్పు పొందడమే కాకుండా మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల రూపాయలను కాంగ్రెస్ నేతలకు కట్టబెట్టేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మూసీ పరీవాహక బాధితులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు.